

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
సోమవారం 3 ఫిబ్రవరి 2025



విద్యుత్ వెలుగులో ఆదిత్యుడి ఆలయం





80 అడుగుల రోడ్డులో ధ్యానం, ఆసనాలు వేస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్ తదితరులు

వైభవంగా..

రథసప్తమి ఉత్సవాలు ప్రారంభం

- 5 వేల మందితో సూర్యనమస్కారాలు
- సుందరంగా ముస్తాబైన సిక్కోలు
- సందడిగా గ్రామీణ క్రీడల పోటీలు
- ఆధ్యాత్మికత ఉట్టిపడేలా శోభాయాత్ర

- శ్రీకాకుళం 80 అడుగుల రోడ్డులో సుమారు 5 వేల మందితో సామూహిక సూర్యనమస్కారాలు.. ధ్యానం.. యోగాసనాలు
- ఎన్టీఆర్ మునిసిపల్ హైస్కూల్ మైదానంలో వాలీబాల్, వెయిట్‌లిఫ్టింగ్, కర్రసాము, సంగిడీలు, ఉలవల బస్తా లిఫ్టింగ్, పిల్లి మొగ్గలు వంటి గ్రామీణ క్రీడా పోటీలు..
- డేఅండ్‌నైట్ జంక్షన్ నుంచి నమూనా రథాలతో అరస వల్లిలోని ఆదిత్యుడి ఆలయం వరకూ శోభాయాత్ర..
- ఆకట్టుకున్న జానపద కళారూపాలు, కోలాటం, తప్పెటగుళ్లు, థింసా నృత్య ప్రదర్శనలు..
- శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ (ఆర్ట్స్) కళాశాల మైదానంలో సాంస్కృతిక కార్యక్రమాలు.. పౌరాణిక నాటక ప్రదర్శనలు..
- కలెక్టరేట్ సమీపాన డబ్ బిల్డింగ్ వద్ద హెలికాప్టర్ టూరిజం.. ప్రత్యేక ఆకర్షణగా లేజర్‌షో..



శోభాయాత్రలో పాల్గొన్న మంత్రి అచ్చెన్నాయుడు..



ఏర్పాట్లపై ఈవోతో మాట్లాడుతున్న డీఐజీ గోపీనాథ్ జెట్టీ, ఎస్పీ మహేశ్వరరెడ్డి



చిత్రలేఖనం పోటీ విజేతలతో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్







-ఇవీ అరసవల్లిలో రథసప్తమి వేళ.. ఆదివారం ఉదయం నుంచీ రాత్రివరకూ ఉత్సాహంగా సాగిన వేడుకలు. ప్రభుత్వం తొలిసారిగా రథసప్తమిని రాష్ట్ర పండుగగా ప్రకటించగా.. ఈ వేడుకలు నిజంగానే పండుగ వాతావరణాన్ని తలపించాయి. ఎక్కడ చూసినా సందడే సందడి కనిపించింది.

అరసవల్లి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి):

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లిలో రథసప్తమి ఉత్సవాలు.. ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. కూటమి ప్రభుత్వం రథసప్తమిని రాష్ట్ర పండుగా ప్రకటించడంతో.. ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది సంబరాలు అంబరాన్ని తాకాయి. వేడుకల వేళ.. సిక్కోలు సుందరంగా ముస్తాబైంది. శ్రీకాకుళం నగరం నుంచి అరసవల్లి వరకూ ఎక్కడ చూసినా

(మిగతా 8వ పేజీలో..)



శోభాయాత్రలో ఆకట్టుకున్న ప్రదర్శనలు



అభివాదం చేస్తున్న టీవీ కళాకారులు ఆటో రామ్‌ప్రసాద్, శాంతిస్వరూప్



అరసవల్లి జంక్షన్‌లో ఏర్పాటు చేసిన సూర్యనమస్కారాల విగ్రహాలు



ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శనలు

నేటి అర్ధరాత్రి నుంచి ఆదిత్యునికి క్షీరాభిషేకం
వీఐపీలకన్నా సామాన్యులకే ప్రాధాన్యం
- మంత్రి అచ్చెన్నాయుడు
8లో

కట్టుదిట్టమైన బందోబస్తు
- డీఐజీ గోపినాథ్ జెట్టి
7లో

మార్చి 8 వరకు 'మీ-కోసం' రద్దు

శ్రీకాకుళంక్రైం, ఫిబ్రవరి2 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న మీ కోసం (ప్రజాసమస్యల పరిష్కార వేదిక) కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు ఎస్పీ కె.వి. మహేశ్వరరెడ్డి ఆదివారం ఓ ప్రకట నలో పేర్కొన్నారు. ఈ నెల 2 నుంచి మార్చి 8వరకు రద్దు చేస్తున్నట్టు స్పష్టం చేశారు. ప్రతీ శుక్రవారం కాశీబుగ్గలో నిర్వహించనున్న కార్యక్రమాన్ని కూడా రద్దు చేశామన్నారు. ప్రజలు సమస్యలను నేరుగా పోలీసు స్టేషన్‌కు విన్నవించాలని సూచించారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత 'మీ-కోసం' కార్యక్రమం యథావిధిగా సాగు తుందని తెలిపారు.

పెళ్లికి ఒప్పుకోనందుకే..
- విద్యార్థినిపై దాడి కేసులో నిందితుడి అరెస్టు
8లో

ఇసుక మనది.. కాసులు వారివి

- ఒడిశా వ్యాపారుల దందా
- ఆకులతంపర రేవు నుంచి అక్రమంగా రవాణా
- రాత్రివేళలో సరిహద్దు దాటిస్తున్న వైనం
- పట్టించుకోని అధికారులు

మెళియాపుట్టి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభు త్వం తీసుకొచ్చిన ఉచిత ఇసు క విధానం ఒడిశా వ్యాపారుల కు కాసులు వర్షం కురిపి స్తోంది. జిల్లాలోని రీచ్‌ల్లో ఉచితంగా ఇసుకను తవ్వి ట్రాక్టర్ల ద్వారా ఆ రాష్ట్రానికి అక్రమంగా తరలించుకుపోతు న్నారు. వాస్తవానికి ఒడిశాకు సంబంధించి కాశీనగరం వద్ద ఇసుక రీచ్‌కు అనుమతులు ఇచ్చారు. అక్కడ నుంచి ట్రాక్టర్‌తో ఇసుక తరలించా లంటే సీనరేజీ, రవాణా వంటి కోసం సుమారు రూ.15వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తుంది. దీనివల్ల ఇసుక వ్యాపారులకు ఏమీ మిగలడం లేదు. అదే సరిహద్దున ఆంధ్రా పరిధిలోని ఉన్న కొత్తూరు మండలం ఆకులతంపర రేవు (కొత్తూరు మండలం) నుంచి ట్రాక్టర్ ఇసుకను ఒడిశా సరిహద్దుకు చేర్చేందుకు కేవలం రూ.1500 డీజిల్ ఖర్చు అవుతుంది. ఈ ఇసుకను ఒడిశా లో రూ.7,500 నుంచి రూ.8వేల వరకు విక్ర యిస్తున్నారు. టిప్పరు లోడు అయితే రూ.25 వేల నుంచి రూ.30వేల వరకు విక్రయిస్తు న్నారు. రాష్ట్రంలో ఇసుక ఉచిత కావడంతో ఆకులతంపర రేవు నుంచి అక్రమంగా తరలించుకుపోతున్నారు. పగలు అయితే అధికారులు, పోలీసులు నిఘా ఉంటుందని రాత్రివేళలో రూట్ మార్చి దందా సాగిస్తు న్నారు. మెళియాపుట్టి వరకు ఆరేడు ట్రాక్టర్లు వచ్చి కొన్ని పాతశాల రోడ్డు నుంచి బిన్నాళ వైపు, మరి కొన్ని కొసమాళ వీధి నుంచి గురండి వైపు, ఇంకొన్ని చాపర నుంచి మోడాలు వైపు ఇసుక తరలిస్తున్నట్లు తెలుస్తోంది.



ఆకులతంపర రేవు నుంచి ఇసుకను ఒడిశాకు అక్రమ రవాణా ఇలా..

పట్టుకున్నా.. వదిలేస్తున్నారు..

ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను కొన్నిసార్లు పోలీసులు పట్టుకుని రెవెన్యూ అధికారులకు అప్పగిస్తున్నారు. వారు రూ.2 వేల అపరాధ రుసుం విధించి.. ఇసుక ట్రాక్టర్లను వదిలేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. దీంతో పోలీసులు అక్రమ రవాణాను పట్టించుకోవడం లేదని తెలు స్తోంది. కొంతమంది అధికారులు ట్రాక్టర్ల యజమానులకు మధ్యవర్తులుగా వ్యవహరించి ఒడిశా వ్యాపారుల నుంచి అధికంగా డబ్బులు గుంజుతు న్నారనే ఆరోపణలు ఉన్నాయి. మంగళ వారం రాత్రి 10 గంటల తరువాత మెళియాపుట్టి సరి హద్దు దాటి నాలుగు ట్రాక్టర్లు, బుధవారం వేకువ జామున 4 గంటలకు మరో రెండు ఇసుక ట్రాక్టర్లు ఒడిశా వైపు వెళ్లినట్లు స్థానికులు చెబుతున్నారు. నిరంతరం ఇసుక అక్రమ రవాణా సాగుతోందని పేర్కొంటున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులు, రెవెన్యూ అధికారులు పట్టించు కోకపోవడంపై విమర్శలు వ్యక్తమవు తున్నాయి. కాగా, ఇసుకాసురులకు కొంతమంది కూటమి నాయకుల అండ దండలు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

వాహనాలు సీజ్ చేస్తాం..

రెండు రోజుల కిందట ఆంధ్రా నుంచి ఒడిశాకు ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకొని అపరాధం రుసుం వసూలు చేసి వదిలిపెట్టాం. ఇక నుంచి వాహనాలు పట్టుబడితే సీజ్ చేస్తాం.

-బి.పాపారావు, తహసీల్దార్, మెళియాపుట్టి



ఇచ్ఛాపురంలో బాలికల జూనియర్ కళాశాల

11 వేల మందికి.. ఒక్కరూ లేరు!

- జిల్లాలో వ్యాయామ ఉపాధ్యాయుల కొరత
- ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కానరాని క్రీడలు

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కళాశాల స్థాయిలో క్రీడలకు ప్రోత్సాహం కరువవుతోంది. ప్రధానంగా వ్యాయామ ఉపాధ్యాయుల కొరతే దీనికి కారణమని తెలుస్తోంది. మైదానాలు కూడా లేకపోవడం మరో కారణం. గతంలో చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యం ఇచ్చేవారు. ఏటా అంతర్ జూనియర్, అంతర్ డిగ్రీ కళాశాల స్థాయి క్రీడాపోటీలు నిర్వహించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేకపోవడంతో క్రీడాకారులు బయట అసోసియేషన్ల తరపున ఆడాల్సిన దౌర్భగ్య దుస్థితి నెలకొంది.

జిల్లాలో 38 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఉన్నాయి. ఇంటర్ ప్రథమ సంవత్సరం 5,980 మంది, ద్వితీయ సంవత్సరం 5,066 మంది విద్యార్థులు ఉన్నారు. సరాసరి 11 వేలమందికి పైగా విద్యార్థులు ఉండగా.. వీరికి క్రీడల్లో శిక్షణ ఇచ్చేందుకు కనీసస్థాయిలో ఒక్క వ్యాయామ ఉపాధ్యాయుడు కూడా లేకపోవడం దారుణం. అప్పట్లో జూనియర్ కాలేజీ అంటే ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విభాగాలు కొనసాగేవి. ఏటా క్రీడాపోటీలు నిర్వహించేవారు. అప్పట్లో ఉన్న వ్యాయామ ఉపాధ్యాయులు పదవీవిరమణ తర్వాత కొత్తగా పోస్టులు భర్తీ చేయలేదు. సబ్జెక్టు బోధకుల మాదిరి కాంట్రాక్టు ప్రతిపాదికన కూడా నియమించలేదు. దీంతో కాలేజీల్లో క్రీడా శిక్షణ కనుమరుగైంది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ కాలేజీల్లో సైతం క్రీడలకు స్థానం లేకుండా పోయింది.

మైదానాల కొరత..

జిల్లాలో చాలా ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు మైదానాలు లేవు. 38 కాలేజీలకుగాను 16 కాలేజీల్లో అసలు మైదానాలే లేనట్టు తెలుస్తోంది. ఉన్న మైదానాలు సైతం సరైన నిర్వహణ లేక అస్తవ్యస్తంగా మారాయి. కొన్నిచోట్ల గత వైసీపీ సర్కారు 'నాడు-నేడు' పనుల పేరిట అస్తవ్యస్తంగా మార్చేసింది. భవన నిర్మాణ సామగ్రితో పాటు తొలగించిన భవనాలకు సంబంధి వేస్ట్ మెటీరియల్‌ను పడేసింది. దీంతో ఆటలు ఆడుకునేందుకు వీలులేకుండా పోయింది. గత ఐదేళ్ల పాటు ప్రభుత్వ కాలేజీల స్థాయిలో క్రీడా పోటీలు కూడా నిర్వహించలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వమైనా కళాశాలల స్థాయిలో క్రీడా పోటీల నిర్వహణకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. మైదానాలు బాగుచేయాలని, వ్యాయామ ఉపాధ్యాయులను నియమించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయమై జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి శివ్వాల తవిటినాయుడు వద్ద ప్రస్తావించగా.. జిల్లాలోని 38 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయుల భర్తీ కోసం ఉన్నతాధికారులకు నివేదిక అందజేశామని తెలిపారు.

గ్రామీణ క్రీడలతో మరింత ఉత్సాహం

- కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు
- సందడిగా రథసప్తమి క్రీడా పోటీలు



సంగిడీ పోటీలు తిలకిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే శంకర్ తదితరులు

శ్రీకాకుళం స్పోర్ట్స్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): గ్రామీణ క్రీడా పోటీలు రథసప్తమి వేడుకలకు మరింత ఉత్సాహాన్ని ఇచ్చాయని కేంద్ర కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. స్థానిక ఏడు రోడ్ల కూడలిలో ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ క్రీడా మైదానంలో ఆదివారం నిర్వహించిన ఈ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామీణ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అందరూ క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని కోరారు. వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, కర్రసాము, సంగిడీ, ఉలవల బస్తా, పిల్లి మొగ్గలు తదితర క్రీడలను ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి తిలకించారు. వెయిట్ లిఫ్టింగ్ పురుషుల విభాగంలో ఎ.గోవిందరావు (నిమ్మాడ), ఎం.తరుణ్ (పెద్దపాడు), జి.టింకుల్ కుమార్ (ఆడవరం) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. మహిళా విభాగంలో గుజ్జల వర్షిత (ఆడవరం), డి.హేమశ్రీ (బూరవల్లి), సీహెచ్ హరికారాజ్ (కొర్లకోట) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు నాకౌట్ పద్ధతిలో కొనసాగుతున్నాయి.

కలెక్టర్ సార్ సెల్ఫీ ఇవ్వరూ..



కలెక్టర్‌తో సెల్ఫీ తీసుకుంటున్న బాలుడు

శ్రీకాకుళం అర్బన్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మిల్లు జంక్షన్ కూడలిలో ఏర్పాటు చేసి సూర్యనమస్కారాల ప్రతిమలు జిల్లా వాసులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆదివారం ఉదయం 80 అడుగుల రోడ్డులో సూర్యనమస్కారాల్లో పాల్గొన్న ఓ బాలుడు ఈ ప్రతిమలను చూసేందుకు వచ్చాడు. అదే సమయంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అక్కడకు చేరుకుని ఏర్పాటు చేసిన ప్రతిమలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ బాలుడు కలెక్టర్ వద్దకు చేరుకుని తనకో సెల్ఫీ ఇవ్వాలంటూ కోరాడు. దీంతో ఆ బాలుడితో కలెక్టర్ సెల్ఫీ దిగారు.

వినీలాకాశంలో విహరిస్తూ..



అరసవల్లి/అర్బన్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): రథసప్తమి వేడుకలు సందర్భంగా సిక్కోలు నగరంలో తొలిసారిగా ఏర్పాటు చేసిన హెలికాప్టర్ టూరిజం సిక్కోలు వాసులను అలరించింది. వినీలాకాశంలో జిల్లావాసులు విహరిస్తూ ఆనందంగా గడిపారు. ఆదివారం ఉదయం 9గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా, మంచు ప్రభావంతో 11.40 గంటలకు కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే శంకర్‌తో కలిసి ప్రారంభించారు. తొలుత కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, ఆర్డీవోలు సాయి ప్రత్యూష, కృష్ణమూర్తి, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి హెలికాప్టర్‌లో సిక్కోలు గగనతలంపై విహరించారు. అనంతరం చిత్రలేఖనం పోటీల్లో విజేతలుగా నిలిచిన చిన్నారులకు ఉచితంగా హెలికాప్టర్ ప్రయాణ సౌకర్యాన్ని కల్పించారు. ముందుగా టిక్కెట్లు బుక్ చేసుకున్న వారు హెలికాప్టర్‌లో ఆకాశ విహారాన్ని ఆనందించారు. ఒకసారి ఆరుగురు చొప్పున్న హెలికాప్టర్‌లో విహరించారు. ఒక్కొక్కరికి టికెట్ రూ.1800 కాగా ఎనిమిది నిమిషాలపాటు ఆకాశంలో సిక్కోలు నగరాన్ని వీక్షించారు.

మొరాయించిన వెబ్‌సైట్

హెలికాప్టర్ విహారానికి ముందుగా సంబంధిత వెబ్‌సైట్ ద్వారా టిక్కెట్లు బుక్ చేసుకున్న వారికే ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని అధికారులు ప్రకటించారు. కానీ ఆన్‌లైన్‌లో పెద్ద ఎత్తున ప్రజలు టిక్కెట్ల బుకింగ్‌కు ప్రయత్నించడంతో సర్వర్ మొరాయించింది. దీంతో ప్రజలు నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్ వద్దకు ప్రజలు టిక్కెట్ల కోసం ఎగబడ్డారు. అక్కడా ఇదే పరిస్థితి ఎదురవడంతో ప్రజలు ఇబ్బందిపడ్డారు. ఆదివారం ఈ హెలికాప్టర్ విహారంలో 200 మంది పాల్గొన్నారని, ఎనిమిది నిమిషాల చొప్పున 33 రౌండ్ల తిరిగినట్టు డ్వామా పీడీ సుధాకర్ తెలిపారు. దీని ద్వారా రూ.3.60 లక్షలు ఆదాయం సమకూరిందన్నారు. సోమవారం ఉదయం 9.00గంటల నుంచి సాయంత్రం 4.00 వరకు ఆన్‌లైన్ బుకింగ్ పూర్తయిందని, సాయంత్రం 4.00 గంటల తర్వాత విహారయాత్రకు సంబంధించి డచ్ బిల్డింగ్ వద్ద టికెట్లు ఇవ్వనున్నట్టు తెలిపారు. మంగళవారం కూడా హెలికాప్టర్ ప్రయాణ సదుపాయం అందుబాటులో ఉంటుందన్నారు.



హెలికాప్టర్ ప్రయాణం పూర్తి చేసుకుని వస్తున్న కలెక్టర్, ఎస్పీ తదితరులు

అలరించిన ప్రదర్శనలు



సాంస్కృతిక ప్రదర్శనలు తిలకిస్తున్న ప్రజలు



శ్రీకాకుళం కల్చరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): రథసప్తమి వేడుకల్లో భాగంగా తొలిరోజు ఆదివారం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన వేదికపై కళాకారులు తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. అలా గే లైట్ మ్యూజిక్, సినీ సంగీతం, శాస్త్రీయ సంగీతం, శాస్త్రీయ జానపద సంగీతం, శాస్త్రీయ నృత్యం ప్రదర్శనలు రంజింపజేశాయి. ఆరోహి స్కూల్ ఆఫ్ మ్యూజిక్, దుంపల ఈశ్వర్ బృందం, యామినీ కృష్ణ బృందం, పరిమళ బృందం, అనురాధ బృందం లక్ష్మీగణపతి శర్మ బృందం కళాకారులు తమ గాన, నృత్యాలతో ప్రేక్షకులను అలరించారు.

ధూంధాం సందడి..

నటుడు ఆటో రాంప్రసాద్, ఫైమా, ఢీ భూమిక, రేలారే రేలా టీమ్, మిమిక్రీ ఆనంద్, జోష్ శివ, పిన్నీ సాంగ్ ఫేమ్ షన్ముఖ్, సురేష్ రేష్మ (సింగింగ్), బాలాజీ (శ్రీకాకుళం) వంటి ప్రముఖులు పాల్గొన్న ధూంధాం కార్యక్రమం ఆకట్టుకుంది. ఆటో రాంప్రసాద్ తన కామెడీతో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించాడు. ఫైమా తన డ్యాన్స్‌తో అలరించింది. అలాగే జిల్లాలో తొలిసారి ఏర్పాటు చేసిన లేజర్ షో ఆకట్టుకుంది. ఆకాశంలో రంగురంగుల కాంతులతో మంత్రముగ్ధులను చేశాయి. అంజనా కళా సంస్థ ఆధ్వర్యంలో పంచరత్న పౌరాణిక నాటకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రముఖ నటీనటులు తమ అద్భుతమైన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

కట్టుదిట్టమైన బందోబస్తు

- రథసప్తమి ఏర్పాట్లు పరిశీలించిన విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జెట్టి

శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): రథసప్తమి వేడుకలకు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జెట్టి తెలిపారు. ఈ సందర్భంగా నగరంలోని మిల్లు జంక్షన్‌లో ట్రాఫిక్ నియంత్రణ ఏర్పాట్లను డీఐజీ పరిశీలించి, క్రమబద్ధీకరణకు అవసరమైన ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. అక్కడ నుంచి నడక మార్గంలో సూర్యనారాయణ స్వామి ఆలయం వద్దకు చేరుకుని మార్గమధ్యలో రోడ్డుకు ఇరువైపులా ట్రాఫిక్ అంతరం లేకుండా, రోడ్లు మార్గంలో నిలిపిన వాహనాలను ఎప్పటికప్పుడు టోయింగ్ వాహనంతో క్లియర్ చేయించాలన్నారు. నిర్ధేశించిన స్థలంలోనే వాహనాలను పార్కింగ్ చేసుకునేలా వాహనదారులకు అవగాహన కలిగించేలా రోడ్లపై సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించి, అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా బందోబస్తు ఏర్పాట్లు, క్యూలైన్లు, ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఆలయం లోపల భక్తులు ఒకే సమయంలో అధిక సంఖ్యలో రద్దీ లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం ఆర్ట్స్ కళాశాలలో జరగనున్న పలు సాంస్కృతిక కార్యక్రమాలు, సంబంధించిన ఏర్పాట్లు పరిశీలించారు. ట్రాఫిక్ ఇబ్బందులు, తోపులాటలు లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని డీఐజీ గోపినాథ్ జట్టి పోలీసు అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, ఏఎస్పీలు కేవీ రమణ, పి.శ్రీనివాసరావు, డీఎస్పీ సీహెచ్ వివేకానంద, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆదివారం సాయంత్రం కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఎస్పీ మహేశ్వరరెడ్డి పరిశీలించి, పలు సూచనలు చేశారు.





వేషధారణల్లో కళాకారులు, ఆకట్టుకున్న గిరిజన నృత్యాలు

ప్రారంభానికి సిద్ధమైన రాధాకృష్ణ మందిరం

- నేటి నుంచి ఐదు రోజుల పాటు ఉత్సవాలు



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న రాధాకృష్ణ మందిరం

రణస్థలం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): బంటుపల్లి పంచాయతీ పరిధిలోని గోశాల, రాధాకృష్ణ మందిరం ప్రారంభానికి సిద్ధమయ్యాయి. జగన్నాథ, సుభద్ర, బలభద్ర విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు సోమవారం నుంచి ఐదురోజుల పాటు జగనున్నాయి. దేశ నలుమూలల నుంచి సాధువులు, వేలాది మంది భక్తులు హాజరుకానున్నారు. జాతీయ రహదారిని అనుకొని ఉన్న ఈ ఆలయం భక్తులకు కనువిందు చేయనుంది. భక్తులకు పూర్తి స్థాయిలో సౌకర్యాలు ఏర్పాటు చేసినట్టు శ్రీకృష్ణ చైతన్య మిషన్ వర్తమాన అధ్యక్షుడు కేశవ గోస్వామి మహారాజ్ తెలిపారు. సుమారు రూ.18 కోట్ల ఖర్చుతో ఈ ఆలయ నిర్మాణం జరిగిందన్నారు. 108 అడుగుల ఎత్తు, 75 అడుగు వెడల్పుతో పూరీ ఆలయాన్ని తలపించేలా ఈ ఆలయాన్ని రూపొందించారు. 51 మంది రుత్వికులతో యజ్ఞ యాగాలు చేయనున్నట్టు తెలిపారు.

ఘనంగా 'తెరవే' సాహితీ సమ్మేళనం

శ్రీకాకుళం కల్చరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): తెలుగు రచయితల వేదిక (తెరవే) ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఉత్తరావల్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో 101 నెలవారీ సాహితీ సమ్మేళనం నిర్వహించారు. సంస్థ సభ్యులు ఇద్ది పాపయ్య, నిక్కు అప్పన్న, ఐఎన్‌డీ ప్రసాద్, కిల్లాన శ్రీనివాస్, యు.నాగేశ్వరరావు, ముట్నూరు ఉపేంద్ర శర్మ, ఉమామహేశ్వరరావు, జె.శరత్‌బాబు, సోడవరం ఈశ్వరరావు, బాలాజీ రవికిరణ్, కిమ్మి సంతోష్ రెడ్డి లలితా రెడ్డి, తంగి ఎర్రమ్మ, పేర్రాజు, తెప్పల కృష్ణమూర్తి తదితరులు రథసప్తమి సందర్భంగా ఆదిత్యుని వైభవంపై కవితలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా కవులు జంధ్యాల శరత్‌బాబు, తెప్పల కృష్ణమూర్తి, కిమ్మి సంతోష్ రెడ్డి లలిత, పేర్రాజు, బి.జగన్నాధరావును సత్కరించి మెమొంటో అందించారు.

ఆయన సేవలు ఆదర్శనీయం

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): అనాధులకు అండగా, ఆపదలో ఉన్నవారికి ఆర్థిక సాయం చేస్తూ తన సేవా కార్యక్రమాలతో హెడ్ కానిస్టేబుల్ తెలుకల రామారావు ఆదర్శంగా నిలుస్తున్నారని అలియన్స్ క్లబ్ అధ్యక్షుడు లోపింటి నరసింహమూర్తి, వ్యాపారవేత్త బత్తుల వెంకటరమణ అన్నారు. ఆదివారం అలియన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ సభ్యులు, సీనియర్ సిటిజన్స్, వాకర్స్, క్రీడాకారులు ఆయన్ని సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఇటీవల జిల్లా కేంద్రంలో జరిగిన గణతంత్ర దినోత్సవం వేడుకల్లో కలెక్టర్ నుంచి ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న సందర్భంగా రామారావును ప్రత్యేకంగా అభినందించారు.

ఐకాన్ అవార్డు అందుకున్న శ్రీనివాస్



గార, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): జొన్నలపాడుకు చెందిన బృందావనం నిర్వాహకులు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ గాయకులు చౌదరి శ్రీనివాస్ ఆదివారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఇండియన్ ఐకాన్ అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో కాళోజీ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సంస్థలు ప్రతినిధులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆలయ వార్షికోత్సవం పూజలు

గార, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): శాలిహుండం వద్ద ప్రసిద్ధ శ్వేతగిరిపై గల వీర వసంత ఈశ్వర స్వామి వారి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా రెండో రోజు ఆదివారం ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు మహేంద్రాడ రవికుమార్ ఆధ్వర్యంలో రుత్వికులు పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎం పీపీ గుండ భాస్కరరావు, సర్పంచ్ కె.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు. అలాగే శ్వేతగిరిపై ఈ నెల 8న జరగనున్న వేణుగోపాల స్వామి వారి యాత్ర (భీష్మ ఏకాదశి)లో పాల్గొనాలని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును కలిసి ఆహ్వాన పత్రిక అందజేసినట్టు ఆలయ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ సుగ్గు మధురెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు తెలిపారు.

చిత్తడి నేలలను కాపాడుకుందాం



మాట్లాడుతున్న వక్త

సోంపేట, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): చిత్తడి నేలలను కాపాడుకునేందుకు యువత నడుం బిగించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం సందర్భంగా స్థానిక కళాసీ సంఘ భవనంలో పర్యావరణ పరిరక్షణ సంఘం అధ్యక్షుడు డాక్టర్ యారాడి కృష్ణమూర్తి అధ్యక్షతన ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. భావి తరాల మనుగడ ప్రశ్నార్థకంగా మరే ప్రమాదం ఉందని, యువత పర్యావరణం కాపాడుకునేందుకు నడుం కట్టాలన్నారు. వాతావరణంలో ఉన్న ప్రాణవాయువ నిష్పత్తి తగ్గినట్లైతే భూమి మీద ఉండే అన్ని జీవరాశులు అంతరించే ప్రమాదం ఉందన్నారు. సంవత్సరం పొడవున నీరు ఉండి వివిధ రకాల పక్షులు, జీవరాశులకు నెలవైన మన బీల ప్రాంతాన్ని కాపాడుకునేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బోలిశెట్టి సత్యన్నారాయణ, జేవీ రత్నం, సనపల శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల ఆవిష్కరణ

కంచిలి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): బొగాబెణీ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో సరస్వతీదేవి, భారత మాత విగ్రహాలను ఎంఈవోలు ఎస్.శివరాంప్రసాద్, చిట్టిబాబు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల ఎస్ఎంసీ ఛైర్‌పర్సన్ పొందర లలిత, మాజీ ఛైర్మన్ పొందర ధనుంజయ ఈ విగ్రహాలను అందించినట్లు హెచ్ఎం శరత్ చంద్రబెహరా తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ ఛైర్మన్ సీతారామనాయుడు, సర్పంచ్ గనప సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

వసంత పంచమి పూజలు

ఎచ్చెర్ల, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): అల్లినగరం జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలోని సరస్వతీ దేవి విగ్రహం వద్ద విద్యార్థులు, ఉపాధ్యాయులు వసంత పంచమి సందర్భంగా ఆదివారం పూజలు నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాజ సేవతోనే గుర్తింపు : ప్రభుత్వ విప్



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బెందాళం అశోక్

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): సమాజ సేవతోనే తగిన గుర్తింపు వస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జేసీఐ ఆధ్వర్యంలో జరిగిన క్లబ్ ఇనస్టలేషన్ సెర్మినీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా జేసీఐ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం జరిగింది. నూతన అధ్యక్షుడిగా కాళ్ల జయదేవ్ ఎన్నికయ్యాడు. ఎమ్మెల్యేకు క్లబ్ సభ్యులు సాలువలతో సత్కరించారు. టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కాళ్ల ధర్మారావు, నందికి జాని, రాష్ట్ర కార్యదర్శి సాలిన డిల్లీయాదవ్, నాయకులు కొరాయి ధర్మరాజు, జిలానీ, బి.కృష్ణయ్య, క్లబ్ సభ్యులు అనుదీప్, పవన్, ప్రేంసాయి పాల్గొన్నారు.

కళాకారులకు అవార్డులు

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన స్వేచ్ఛావతి నృత్య తరంగిణి సంగీత నాట్య గురువులకు కళా విపంచి అవార్డు, నాట్య కళాకారులకు మయూఖ పురస్కారాలు అందుకున్నారు. లాస్యప్రియ కూచిపూడి నృత్యనికేతన్ రాజమహేంద్రవరం వారు నిర్వహించిన ఇండియన్ కల్చర్ ఆర్ట్స్ ఫెస్టివల్-6, నేషనల్ డాన్స్ అండ్ మ్యూజిక్ ఫెస్టివల్ ఈ నెల 1, 2 తేదీల్లో నిర్వహించిన కార్యక్రమంలో కూచిపూడి, భరతనాట్యంలో అద్భుత ప్రదర్శనలు ఇచ్చారు. దీంతో నాట్య గురువులతోపాటు నాట్య కళాకారులకు పురష్కారాలు అందించారని స్వేచ్ఛావతి నృత్య తరంగిణి అకాడమీ అధ్యక్షుడు కె.గోవింద్ తెలిపారు.

సామూహిక అక్షరాభ్యాసాలు

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): శ్రీపంచమి సందర్భంగా భవానీపురం అంగన్‌వాడీ కేంద్రంలో ఆదివారం సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. రత్తకన్న, రత్తకన్న కాలనీకి చెందిన చిన్నారులు అక్షరాభ్యాసాలు చేసుకున్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త నర్సమ్మ, సహాయకులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అండర్ పాసేజ్ కోసం నేడు నిరసన

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే ఎల్‌సీ గేటు సమీపంలో అండర్ పాసేజ్ నిర్మాణం, బ్రిడ్జ్ నిర్మాణం చేపట్టాలని కోరుతూ సోమవారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు అన్నారు. రైల్వే అండర్ పాసేజ్ నిర్మాణం చేపట్టాలని రాజకీయ నాయకులు రైల్వే ఉన్నతాధికారులకు వినతి పత్రాలు అందజేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. రైల్వే జీఎం ఇచ్ఛాపురం రానున్న సందర్భంగా ప్రజలంతా పెద్ద ఎత్తున తరలివచ్చి నిరసన కార్యక్రమంలో పాల్గొనాలని రాజు కోరారు. ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలకు, ఆటో, లారీ, ట్యాక్సీ యూనియన్ ప్రతినిధులను కలిసి మద్దతు తెలపాలని కోరారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

లావేరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని లావేరు గ్రంథాలయాధికారి ఎం.శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం స్థానిక గ్రంథాలయం ఆవరణలో విద్యార్థులకు యోగా ఆసనాలు నేర్పించారు. ఈ సందర్భంగా మురపాక కేజీబీవీ పాఠశాల విద్యార్థి ఇజ్జు రుష్మిత సూర్య నమస్కారాలు చేసి విద్యార్థులతో చేయించారు. ఈ సందర్భంగా యోగా ఆసనాలు వేసిన రుష్మితను అభినందించారు.

సత్యసాయి మందిరం ప్రారంభం

గార, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): సతివాడ గ్రామంలో నూతనంగా నిర్మించిన భగవాన్ సత్యసాయి బాబా మందిరాన్ని ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు ఆదివారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా మందిరంలో సామూహిక సత్య వ్రతాలు నిర్వహించారు. సంస్థ జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు, ఆధ్యాత్మిక సమన్వయకర్తలు అనాది గుప్త, బోయిన నరసింహమూర్తి, భజనమండలి కన్వీనర్లు, సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

చిత్తడి నేలలను పరిరక్షించుకోవాలి

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): చిత్తడి నేలలు పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని డిప్యూటీ ఆర్వో రాము అన్నారు. ఆదివారం తేలుకుంచి వద్ద గల విదేశీ పక్షుల విడిది కేంద్రంలో ప్రపంచ చిత్తడి నేలల పరిరక్షణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో కలిసి గ్రామ చెరువులు చుట్టూ పిచ్చిమొక్కలు. ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. చిత్తడి నేలల ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ అధికారి రాము, తేలుకుంచి గ్రామ సర్పంచ్ పాతిర్ల రాజశేఖర్‌రెడ్డి, ఎఫ్‌బీవోలు భానుమూర్తి, జోగారావు, వెంకటేష్, దుర్గాదేవి, లక్ష్మణమూర్తి, సురేష్ పాల్గొన్నారు.

నేడు రైల్వే జీఎం రాక

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న పనులు పరిశీలించేందుకు సోమవారం రైల్వే జీఎం రానున్నారని డీఆర్‌యూసీసీ సభ్యులు కట్టా సూర్య ప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా రైలు నిలయంలో సమస్యలపై వివరిస్తామన్నారు.

స్కాలర్ షిప్ టెస్ట్‌కు స్పందన

రణస్థలం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): నడుకుదిటిపాలెంలో ఉన్న ఎన్ఈఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన స్కాలర్ షిప్ టెస్ట్‌కు పెద్దఎత్తున విద్యార్థులు హాజరయ్యారు. సుమారు 2000 మంది విద్యార్థులు ఈ పరీక్షలో పాల్గొన్నట్టు నిర్వాహకులు తేజ తెలిపారు.

క్రైం కార్నర్

పెళ్లికి ఒప్పుకోనందుకే..

● విద్యార్థినిపై దాడి కేసులో నిందితుడి అరెస్టు
● వివరాలు వెల్లడించిన ఎస్పీ మహేశ్వరరెడ్డి


మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఉమెన్స్ కళాశాల ప్రాంగణంలో ఇటీవల ఓ విద్యార్థినిపై జరిగిన దాడి కేసును పోలీసులు ఛేదించారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆ వివరాలిలా ఉన్నాయి.. గత నెల 31న నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీఎస్సీ డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న కొరికాన లక్ష్మిపై దాడి జరిగింది. ఈ ఘటనపై ఆమె తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్ఐ ఎం.హరికృష్ణ కేసు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తులో సాంకేతిక పరమైన ఆధారాలు సేక రించి, దాడికి పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని అన్నికోణాల్లో విచారించారు. దాడి జరిగిన తర్వాత విద్యార్థిని సెల్‌ఫోన్ మాయమైంది. టవర్ లొకేషన్ ఆధారంగా ఆ సెల్‌ఫోన్‌ను ట్రేస్ చేయగా.. ఏడు రోడ్ల కూడలి సమీపంలో ఉన్న పార్క్ వద్ద పోలీసులు గుర్తించారు. ఈ సెల్ ఫోన్ ఆధారంగా కేసుకు సంబంధించి అనేక విషయాలు బయటపడ్డాయి. హాస్టల్ నుంచి బయటకు వచ్చిన లక్ష్మి ఓ వ్యక్తితో మాట్లాడడాన్ని గుర్తించిన పోలీసులు ఆ దిశగా విచారణ చేప ట్టారు. ఈ క్రమంలో ఆ వ్యక్తి సారవకోట మండలం గోవర్ధనపురానికి చెందిన కణితి జగదీష్‌గా గుర్తించి అతడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సెల్ లొకేషన్ ఆధారంగా అతడిని పట్టుకుని విచారించగా.. దాడి చేసింది తానేనని అంగీ కరించాడు. అయితే జగదీష్‌తో లక్ష్మికి ముందే పరిచయం ఉండడం దాడి జరిగిన రోజు జగదీష్‌తో కలిసి రాత్రి 7.32 గంటల సమయంలో లక్ష్మి కళాశాలకు రావడం, తిరిగి 7.42 గంటల సమయంలో జగదీష్ గాబరా పడుతూ బయటకి వెళ్లడం సీసీ కెమెరాలో రికార్డయింది. దీనిపై జగదీష్‌ను పోలీసులు విచారించగా.. తాను సినిమాల్లో జూనియర్ ఆర్టిస్ట్‌గా పని చేస్తు న్నానని, తనను పెళ్లి చేసుకోమని లక్ష్మిని అడుగగా ఒప్పుకోకపోవడంతో ఆమె పై దాడి చేసినట్టు జగదీష్ విచారణలో ఒప్పుకున్నట్లు ఎస్పీ తెలిపారు.

692 కెమెరాలు ఏర్పాటు

మహిళలపై దాడులు నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా గత 40 రోజుల్లో 692 కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. మహిళల విషయంలో కథనాలు రాసే ముందు వారి కుటుంబ సభ్యుల కోసం ఆలోచించాలని సమాజంలో వారి గౌరవాన్ని భంగపరచవద్దని ఎస్పీ కోరారు. ఈ కేసును 48 గంటల్లో ఛేదించిన డీఎస్పీ వివేకానంద, టౌన్ సీఐ పి.పైడపునాయుడు, వన్‌టౌన్ ఎస్ఐ ఎం.హరికృష్ణలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో ఎస్‌బీ సీఐ ఇమ్మాన్యుయేల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల కొట్లాట

పొందూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కింతలి పంచాయతీ ఖాజీపేటలో ఇరువర్గాల మధ్య ఆదివారం కొట్లాట జరిగిందని ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం ఉదయం గ్రామానికి చెందిన కంచె రాము, కంచె పోలోడు మరికొంత మందితో కలిసి పల్ల రాజు భార్య రోజాపై దాడి చేశారు. దీంతో ఇంట్లో ఉన్న రోజా కేకలు వేసుకుంటూ బయటకు పరుగులు తీసింది. ఇది గమనించిన రోజా బంధువు పల్ల గంగాధర్, మరో 10 మంది కలిసి కంచె రాము వర్గానికి చెందిన సీతారాం తదితరులపై దాడిచేశారు. ఈ ఘర్షణలో ఇరువర్గాలకు చెందిన కొంత మంది గాయపడ్డారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని కొట్లాటను అడ్డుకున్నారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

అరకు ఉత్సవాల్లో సిక్కోలు కళాకారులు

పలాసరూరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులో గత మూడు రోజులుగా జరుగుతున్న అరకు చలి ఉత్సవాల్లో శ్రీకాకుళం జిల్లాకు చెందిన కళాకారులకు అవకాశం లభించింది. ఉత్తరాంధ్ర జానపద కళలైన జముకుల పాట, చెక్క భజన ప్రద ర్శనలు నిర్వహించినట్లు గిడుగు రామమూర్తి తెలుగుభాష, జానపద కళాపీఠం అధ్యక్షుడు బద్రి కూర్మారావు తెలిపారు. తనతో పాటు 33 మంది కళాకారులు ఈ ప్రదర్శనలిచ్చినట్లు సమన్వయకర్త ఎస్.చిన్నారెడ్డి పేర్కొన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

పలాసరూరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): గెలుపోటములను సమానంగా తీసుకోవాలని వక్తలు అన్నారు. గొల్లమాకన్నపల్లి గ్రామంలో ఆహ్వానిత జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వ హించారు. గొల్లమాకన్నపల్లి జట్టు విజేతగా నిలవగా ఆదివారం బహుమతులను అందజేశారు. శ్రీకాకుళం రెండవ, మామిడిపల్లి మూడవ, బహడాపల్లి జట్టు నాలుగవ స్థానాలను సాధించాయి. కార్యక్రమంలో అగ్నికులక్షత్రియ కార్పొ రేషన్ డైరెక్టర్ కుత్తుమ లక్ష్మణ కుమార్, సర్పంచ్ సైని దేశయ్య, కె.ఫల్గుణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిభావంతోనే ఐక్యత: ఎమ్మెల్యే బగ్గు


స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

జలుమూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని ప్రజలు భక్తి భావం కలిగిన నాడు ఐక్యత సాధించవచ్చని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. స్వగ్రామమైన మర్రివలసలో నూతనంగా నిర్మించిన పంచముఖ ఆంజనేయస్వామి, షిర్డీసాయి, సుబ్రమణ్యస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ, సర్పంచ్ బగ్గు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

నరసన్నపేట, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి):కిల్లాం గ్రామానికి చెందిన గొలివి ధనుంజయ్‌కు వైద్యం నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి రూ.30,786 మంజూరు కాగా ఆ చెక్కును ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి ఆదివారం అందించారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా ఎందరో పేదలకు మెరుగైన వైద్యసదుపాయాలు అందుతున్నాయన్నారు.

రిటైర్డ్ ఆర్మీ జవాన్లకు ఘన స్వాగతం

పలాసరూరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కేదారిపురం గ్రామానికి చెందిన పాడి వేణు గోపాల్, పాడి త్రినాథ్ ఉద్యోగ విరమణ చేసి స్వగ్రామానికి రావడంతో ఆదివారం గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామస్థులు పలాస రైల్వే స్టేషన్ నుంచి కాశీబుగ్గ పట్టణం నుంచి ఊరేగింపుగా గ్రామానికి తీసుకొచ్చి సత్కరించారు.

గరుడుభద్రలో..

వజ్రపుకొత్తూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): గరుడుభద్ర గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ తామాడ కిరణ్‌కుమార్ ఉద్యోగ విరమణ చేసి స్వగ్రామం వచ్చిన సందర్భంగా ఆదివారం గ్రామస్థులు ఘన స్వాగతం పలి కారు. గౌరీశంకర్ యువజన సంఘం సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

లక్షలు వెచ్చించి వదిలేశారు..

● ఎండకు ఎండి వానకు తడిచి
● డీజిల్‌కు నిధులు లేక..
● ఇదీ తహసీల్దార్ కార్యాలయాల్లో జనరేటర్ల దుస్థితి


హిరమండలం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరుపయోగంగా ఉన్న జనరేటర్

హిరమండలం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మండల కార్యాలయాల్లో విద్యుత్ కోతలు, అత్యవసర పరిస్థితుల్లో సేవలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు గాను ఏర్పాటు చేసిన జనరేటర్లు నిరుపయోగంగా ఉన్నాయి. రూ.లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన జనరేటర్లకు నిర్వహణ లేకపోవడంతో ఉత్సవ విగ్రహాల్లా దర్శనమిస్తూ లక్ష్యానికి తూట్లు పడుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలో తీర ప్రాంతం ఎక్కువగా ఉండడంతో ఏటా తుఫాన్ల ప్రభావం తీవ్రంగా ఉంటుంది. ఆ సమయాల్లో ఈదురుగాలులు, వర్షాల కారణంగా విద్యుత్, సమాచార వ్యవస్థ దెబ్బతింటుంది. ఆయా సమయాల్లో గ్రామాల్లోని పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు గాను ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో 2010లో అప్పటి ప్రభుత్వం భారీ జనరేటర్లను ఏర్పాటు చేసింది. ఒక్కో యూనిట్ రూ.30 వేల ఖర్చుతో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని 38 మండలాల్లో ఏర్పాటు చేశారు. దీనివల్ల తహసీల్దార్ కార్యాలయం నుంచి జిల్లా కేంద్రంలోని కంట్రోల్‌రూం, గ్రా మాల్లో తుఫాన్ ప్రభావాన్ని విద్యుత్ అంతరాయం లేకుండా తెలుసుకునేందుకు గాను మంజూరు చేశారు. జనరేటర్లు కేటాయించినా వాటి వినియోగానికి అవసరమయ్యే డీజిల్ కొనుగోలుకు నిధులు కేటాయించ లేదు. ఆ ఖర్చు ఎవరు భరించాలన్న విషయంలోనూ స్పష్టత ఇవ్వకపోవడంతో ఆరంభం నుంచే వాటి నిర్వహణపై మండలాధికారులు పట్టించుకోలేదు. ఆరుబయట ఏర్పాటు చేసి జనరేటర్లకు కనీస రక్షణ కూడా కల్పించలేదు. దీంతో ఎండకు ఎండి వానకు తడిచి పాడవుతున్నాయి. కొన్ని పాడవగా మరికొన్ని పూర్తిగా పనిచేయడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి జనరేటర్లను వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు. దీనిపై తహసీల్దార్ హనుమంతరావును వివరణ కోరగా చాలాకాలంగా వినియోగించకపోవడంతో మరమ్మతులకు గురైంది. బాగు చేయించాలంటే ఎక్కువ మొత్తంలో ఖర్చవుతుందని ప్రభుత్వం నుంచి వీటి నిర్వహణకు ఎలాంటి నిధులు మంజూరు లేవని చెప్పారు.

నేటి అర్ధరాత్రి నుంచి ఆదిత్యునికి క్షీరాభిషేకం


స్వామిని దర్శించుకునేందుకు క్యూలో ఉన్న భక్తులు

అరసవల్లి/ శ్రీకాకుళం అర్బన్, ఫిబ్రవరి 2: అరసవల్లిలో సోమవారం అర్ధరాత్రి 12 గంటల నుంచి సూర్యనారాయణస్వామికి క్షీరాభిషేకం నిర్వహిస్తారు. ప్రత్యేక పూజలు అనంతరం మంగళవారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు స్వామి నిజరూప దర్శనానికి భక్తులను అనుమతిస్తారు. అనంతరం స్వామిని పూలతో ప్రత్యేకంగా అలంకరించి సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు దర్శనమిస్తారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులు కూడా తరలివచ్చి స్వామిని దర్శించుకోనున్నారు. సుమారు 1.20 లక్షల మంది భక్తులు రథసప్తమి ఉత్సవాలకు తరలిరానున్నట్టు అధికారులు అంచనా వేశారు. ఈ మేరకు 2,300 మంది పోలీసులతో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీ పురం మన్యం జిల్లాల అధికారులు కూడా ఉత్సవ కార్యక్రమాల విధులు నిర్వర్తిస్తున్నారు. రాష్ట్ర పండుగను తొలిసారిగా ప్రకటించినందున అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఉత్సవాలను నిర్వహించేందుకు.. జిల్లాలోని కేంద్ర,రాష్ట్ర మంత్రు లు, శ్రీకాకుళం ఎమ్మెల్యే నిరంతరం ఏర్పాట్లను పర్యవే క్షిస్తున్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి.. అధికారులను సమన్వయ పరిచి వేడుకల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళి కొనసాగుతుండడంతో వీఐపీ, వీవీఐపీ, వీవీపీల దర్శనాలను రద్దు చేశారు. ఉచిత క్యూలైన్లలో వచ్చే సాధారణ భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా, నిరం తర దర్శనం కలిగేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈవో వై.భద్రాజీ ఆధ్వర్యంలో ఆలయం రాజగోపురాన్ని విద్యుద్దీపాలంకరణతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. అలాగే భక్తుల సౌకర్యార్థం తోట జంక్షన్ నుంచి సింహద్వారం, అమ్మ వారి గుడి, ఇంద్ర పుష్కరిణి ప్రాంతాల్లో మొత్తం 40 పాయింట్లలో 150 మొబైల్ మరుగుదొడ్లను మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. క్యూలైన్లలో భక్తుల కోసం 30 పాయింట్లలో 80వేల వాటర్ బాటిళ్లను సిద్ధం చేశారు. ఇదిలా ఉండగా మూడురోజుల పండగ నేపథ్యంలో ఆదివారం వందలాది మంది భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. దీంతో అరసవల్లి ప్రాంగణం కళకళలాడింది.

నేటి కార్యక్రమాలు ఇవీ..

రథసప్తమి వేడుకల్లో భాగంగా రెండో రోజు సోమవారం ఉదయం 9 గంటలకు డచ్ బిల్డింగ్ వద్ద హెలికాప్టర్ విహారం కొనసాగనుంది. ఎన్టీఆర్ మునిసిపల్ హైస్కూల్ మైదానంలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తారు. సాయంత్రం 5 గంటల నుంచి స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో సుందరంపల్లి శ్రీనివాస్ శాక్సాఫోన్, 5.30 నుంచి 6.15 వరకు సీతంపేట ఐటీడీఏ జానపదం, బుర్రకథ ప్రదర్శిస్తారు. 6.15 నుంచి 6.45 వరకు శాస్త్రీయ సంగీతం, 6.45 నుంచి 7 వరకు నీరజా సుబ్రహ్మణ్యం బృందంచే శాస్త్రీయ నృత్యం, 7-00 నుండి 7-30 వరకు రఘుపాత్రుని శ్రీకాంత్ బృందంచే శాస్త్రీయ నృత్య కార్యక్రమం ఉంటుంది. 7.30 నుంచి 8 గంటల వరకు సంప్రదాయ కూచిపూడి గురుకులం వారిచే యోగానృత్యం, 8 గంటలకు లేజర్ షో, 8.15 నుంచి మంగ్లీ టీమ్ మూవీ ఆర్కెస్ట్రా నిర్వహిస్తారు.

వైభవంగా..

(ఐదో పేజీ తరువాయి)

ఆధ్యాత్మికత ఉట్టిపడేలా.. సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించేలా సిక్కోలు శోభ కనిపించింది. డేఅండ్ నైట్ జంక్షన్ నుంచి ఏడురోడ్ల జంక్షన్ వరకు, అలాగే పొట్టి శ్రీరాముల జంక్షన్ నుంచి అరసవల్లి మిల్లు జంక్షన్ మీదుగా ఆదిత్యాలయం ఆర్చ్ వరకు విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. ప్రత్యేకంగా మిల్లు జంక్షన్ వద్ద రోడ్డుకు ఇరువైపులా పూలకుండీలతో అలంకరణ, కోణార్క్ చక్రం, జంక్షన్ మధ్యలో సప్తాశ్వరథధారుడైన ఆదిత్యుని విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అదే జంక్షన్ రోడ్డుమధ్యలో డివైడర్‌పై 12 భంగిమలతో కూడిన సూర్యనమస్కారాల విగ్రహాలను ప్రతిష్ఠించారు. కలెక్టరేట్ సమీపంలో డచ్ బంగ్లా వద్ద ఏర్పాటు చేసిన హెలికాప్టర్ టూరిజానికి ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఆదరణ లభించింది.

తొలిరోజు సందడి ఇలా..

● శ్రీకాకుళంలోని 80 అడుగుల రోడ్డులో 5వేల మందితో సూర్య నమస్కారాలు, ధ్యానం నిర్వహించారు. కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్‌తోపాటు అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు, యోగాసాధన, స్వచ్ఛంద, ధార్మిక సంస్థల సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. యోగా గురువు రామారావు ఆధ్వర్యంలో సూర్యనమస్కారాలు చేసి.. ఆసనాలు వేశారు. కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ.. మానవుని శారీరక, మానసిక ఆరోగ్యానికి సూర్యనమస్కారాలు ఎంతో దోహద పడతాయని తెలిపారు. అందరూ ప్రతీరోజు సూర్యనమస్కారాలను సాధన చేసి సుఖ, సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలు జిల్లా చరిత్రలో మైలురాయిగా నిలిచిపోతాయని తెలిపారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. సామూహిక సూర్య నమస్కారాల కార్యక్రమం అద్భుతం.. అపురూపమని కొనియాడారు. రథసప్తమి వేడుకలను విజయవంతం చేయాని కోరారు. ● శ్రీకాకుళం ఎన్టీఆర్ మునిసిపల్ హైస్కూల్ మైదానంలో గ్రామీణ క్రీడల పోటీలను కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రారంభించారు. రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు, ఎత్తుడు రాయి, సంగిడీలు, వెయిట్ లిఫ్టింగ్, కర్రసాము వంటి పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నగరంలో శోభాయాత్ర

రథసప్తమి వేడుకల్లో భాగంగా ఆదిత్యుని శోభాయాత్రను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటలకు ఆర్ట్స్ కాలేజీ రోడ్డు నుంచి ప్రారంభమైన ఈ శోభాయాత్రలో సుమారు 20వేలమంది భక్తులు, ప్రజలు పాల్గొన్నారు. తొలుత సూర్యదేవుని సుందరంగా అలంకరించిన సప్తాశ్వరథంపై ఆశీనులను చేసి.. యాత్ర చేపట్టారు. దానివెనుక అన్నవరం సత్యదేవుని రథం, విజయవాడ దుర్గామల్లేశ్వర అమ్మవారి రథంతోపాటు టూరిజం, ఐటీడీఏ, మత్స్యశాఖ, న్యూక్లియర్ పవర్ ప్లాంట్, ఎయిర్‌పోర్టు, ఆరోగ్యశాఖ, అగ్నిమాపక శకటాలతో యాత్ర నిర్వహించారు. కోలాట ప్రదర్శన, థింసా నృత్యం, సంప్రదాయ కళావేదిక విద్యార్థుల ప్రదర్శన, పులి వేషాలు, కర్రసాము గారడీలు, గిరిజనుల డప్పుల నాట్యం, వివిధ కళా రూపాలతో శోభాయాత్ర సాగింది. ఉత్సవాల్లో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, తదితర ప్రముఖులు పాల్గొని తిలకించారు.

వీఐపీలకన్నా సామాన్యులకే ప్రాధాన్యం

మంత్రి అచ్చెన్న

శ్రీకాకుళం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): రథసప్తమి వేడుకల్లో వీఐపీల కన్నా సామాన్య భక్తులకే ప్రాధాన్యమివ్వాలని అధికారులను ఆదేశించినట్టు వ్యవ సాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. భక్తులంతా స్వామిని ప్రశాంతంగా దర్శించుకోవాలని కోరారు. ఆదివారం రాత్రి విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. గత తప్పిదాలు పునరావృతం కాకుండా.. వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. సామూహిక సూర్య నమస్కారాలు, శోభాయాత్ర ఘనంగా నిర్వహించామని తెలిపారు. తొలిసారిగా హెలీ టూరిజం తీసుకు వచ్చామని, వచ్చే ఏడాది రెండు, మూడు హెలికాప్టర్లు ఏర్పాటు చేస్తామన్నారు.

నిన్నటి నుంచి పిచ్చోడిలా మాట్లాడుతున్నాడు..

నిన్నటి నుంచి పిచ్చోడిలా మాట్లాడుతున్నాడని వైసీపీ అధ్యక్షుడు జగన్‌ను ఉద్దేశించి మంత్రి అచ్చెన్నాయుడు విమర్శించారు. కేంద్రబడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ పేరు చదవలేదని.. బీహార్ పేరు చదివారని ఆరోపణలు చేస్తున్నారన్నారు. బుద్ధీ జ్ఞానం ఉందా అని ప్రశ్నించారు. ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లోనే దేశంలో అత్యధిక నిధులను రాష్ట్రానికి సీఎం చంద్రబాబు తీసుకువచ్చారని వివరించారు. చంద్రబాబుకి బడ్జెట్‌తో పనిలేదని.. ఢిల్లీ వెళ్లగానే గ్రీన్ ఛానల్ ఉందన్న విషయాన్ని ప్రజలు గుర్తించాలని స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టుకు రూ.12,500 కోట్లు, అమరావతి రాజధానికి రూ.15 వేల కోట్లు.. ఇలా చాలావాటికి నిధులు భారీగా ఇస్తున్నా.. వైసీపీ చెత్త విమర్శలు చేస్తోందని మండిపడ్డారు.

చిత్తడి నేలలను పరిరక్షించుకోవాలి


వడ్డితాండ్ర దీక్షా శిబిరం వద్ద నినాదాలు చేస్తున్న దృశ్యం

సంతబొమ్మాళి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): భూమికి చిత్తడి నేలలు ఒక వరమని, వాటిని పరిరక్షించుకోవాలని, లేకుంటే భవిష్యత్ అంధకారంగా తయారవుతుందని కాకరాపల్లి థర్మల్ ఉద్యమకారులు నినదించారు. చిత్తడి నేలల దినోత్సవం సందర్భంగా ఆదివారం వడ్డితాండ్రలో సమావేశం నిర్వహించారు. కాకరాపల్లి తంపర చిత్తడి నేలల పరిరక్షణకు ఈ ప్రాంత ఉద్యమ కారులు చేసిన పోరాటం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. చిత్తడి నేలల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. సమావేశంలో బీల ఉద్యమనేత డిల్లీరావు, ఉత్తరాంధ్ర జర్నలిస్టు సమాఖ్య అధ్యక్షుడు చౌదరి లక్ష్మణరావు, ఉద్యమనాయకులు అనంత, హన్నూరావు, మండల దన్నా, కారుణ్య, కేశవ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కలిగి ఉండాలి



విజేతకు బహుమతి అందిస్తున్న అటవీశాఖాధికారి

టెక్కలి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): చిత్తడి నేలలపై అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ డీఎఫ్‌వో ఏవీ నాగేశ్వరరావు అన్నారు. ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవాన్ని అటవీశాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిత్తడి నేలలను ఎలా పరిరక్షించుకోవాలి, జీవ వైవిధ్యం, భవిష్యత్‌లో ఎటువంటి చర్యలు చేపట్టాలన్న అంశాలను వివరించారు. చిత్తడి నేలల్లో నివసించే పక్షిజాతుల రకాలు, వాటి పరిరక్షణకు తీసుకోవా ల్సిన చర్యలపై అవగాహన కలిగించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో టెక్కలి అటవీ సెక్షన్ అధికారి ఎస్.కృష్ణారావు, బీట్ అధికారి బి.యూన్సీ, రంజిత్, వార్డెన్ సునీత తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ జలాల పరిరక్షణకు దోహదం



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

పాతపట్నం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): చిత్తడి నేతలలతో భూగర్భ జలాల పరిరక్షణ సాధ్యమని, అందువల్ల ఈ నేలలను కాపాడుకోవాలని జిల్లా సైన్స్ అధికారి నల్ల కుమారస్వామి అన్నారు. ప్రపంచ చిత్తడి నేలల సంరక్షణ దినోత్సవాన్ని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవవైవిధ్య పరిరక్షణకు చిత్తడి నేలల సంరక్షణ సామాజిక బాధ్యతగా స్వీకరించాలన్నారు. విద్యార్థులతో కలిసి అవ గాహన ర్యాలీ చేప ట్టారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్.వైకుంఠరావు, గ్రీన్ ఉపాధ్యాయుడు ఎన్టీ రామారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా శివాలయ వార్షికోత్సవం


ఉమా సహిత మల్లేశ్వర స్వామికి సమర్పించిన మిఠాయిలు

నరసన్నపేట, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): పెద్దబొరిగివలస గ్రామంలో ఉమా సహిత మల్లేశ్వరస్వామి దేవస్థానం 12వ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు సామూహిక అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి కల్యాణం చేపట్టారు. స్వామికి 30 రకాల మిఠాయిలతో సారె సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త శాంతిస్వరూప్, బగ్గు రమణయ్య, దామోదర నర్సింహులు, బెహరా అప్పన్న పాల్గొన్నారు.

కన్నులపండువగా..

నందిగాం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కృష్ణరాయపురంలో నూతనంగా నిర్మించిన వేప పోలమ్మతల్లి ఆలయ ప్రారంభం విగ్రహ, శిఖర ప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం కన్నుల పండువగా జరిగాయి. మూడురోజుల పాటు గ్రామస్థుల ఆధ్వర్యంలో పురోహితులు తెలుకుచర్ల ప్రసాదరావు శర్మ పర్యవేక్షణలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ చేపట్టారు. అమ్మవారిని వివిధ పార్టీల నేతలు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ● పాలవలసపేట ఉద్దండ భర్తుపురంలో నూతనంగా నిర్మించిన అభయాంజ నేయస్వామి మందిర ప్రారంభం, విగ్రహ, శిఖర ప్రతిష్ఠ కార్యక్రమాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహిం చారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఈ కార్యక్రమం చేపట్టారు. వందలాదిమందికి అన్నప్రసాద వితరణ చేశారు.

వైభవంగా ప్రతిష్ఠోత్సవం

కొత్తూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): పొన్నుటూరు గ్రామంలో రామాలయ ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ కార్యక్రమాలు చేపట్టారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బూరె నరేంద్ర చక్రవర్తి, మండల నాయకులు దమయంతి, అప్పలనాయుడు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

నరసన్నపేట, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు పదోతరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని, ఈ దిశగా ప్రణాళికాబద్ధంగా చదవాలని ఎంఈవో ఉప్పాడ శాంతారావు అన్నారు. ఆదివారం స్థానిక బోర్డుఉన్నత పాఠశాలలో పదో తరగతి ప్రత్యేక తరగతులను ఆయన పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థులు ప్రభుత్వం అందజేసిన స్టడీ మెటీరియల్ చదవాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు సాయం

పలాస, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ ఎస్సీ వీధికి చెందిన అంబేడ్కర్ సింహగర్జన యూత్, మాదిగ కుల సంఘం సంయుక్తంగా బాధిత కుటుంబాలకు ఆదివారం ఆర్థిక సాయం అందించారు. ఇటీవల హత్యకు గురైన కమిటీ శ్రీనివాస్ కుటుంబానికి రూ.10 వేలు అందిం చారు. అలాగే దయాకర్ అనే విద్యార్థికి ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతుండగా వైద్యం కోసం రూ.25,549 విరాళాలు సేకరించి అతడి కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో నేతాజీ, అప్పలరాజు, జోగారావుతో పాటు సభ్యులు ఉన్నారు.

తారురోడ్డు నిర్మాణంపై హర్షం

వజ్రపుకొత్తూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): దేవునల్తాడ, కొమరల్తాడ, కొత్తపేట గ్రామాలను కలుపుతూ తారురోడ్డు నిర్మాణం చేపడుతుండడంపై ఆయా గ్రామాల నాయకులు, ప్రజలు హర్షం వ్యక్తంచేశారు. ఆదివారం సదరు పనులు జరుగుతున్న ప్రదేశంలో టీడీపీ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోవింద పాపారావు, మాజీ సర్పంచ్ నారాయణస్వామి, నాయకులు తెలే అప్పాజీ విలేకరులతో మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా రోడ్డులేక ఇబ్బందులు పడుతున్న ప్రజలకు కూటమి ప్రభుత్వం తారురోడ్డు నిర్మాణం చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్ర మంలో పీజే పురం సర్పంచ్ అఖిల్, నాయకుడు యోగేష్, కృష్ణ పాల్గొన్నారు.

గొర్రెల మృతిపై ఆరా

టెక్కలి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): గూడేం పంచాయతీ పిట్టలసరియా గ్రామస్థుడు గండేటి అప్పలస్వామికి చెందిన గొర్రెలు మృతిపై పశు వైద్యాధికారులు ఆరా తీశారు. ఆదివారం ఏపీ యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ఇప్పిలి జగదీశ్వరరావు యాదవ్ ఆధ్వర్యంలో పశువైద్యాధికారి ఎం.పూర్ణ చంద్రరావు, జేవీవో చిన్నమ్మి బాధితుడిని కలిసి వివరాలు సేకరించారు. శివరాంపురం సర్పంచ్ సబ్బి జానకిరాం, యాదవ నాయకులు గండేటి భీమారావు తదితరులున్నారు.

రథసప్తమికి ఏర్పాట్లేవీ?

● సముద్ర తీరాల్లో కానరాని పనులు

వజ్రపుకొత్తూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): రథసప్తమి పర్వదినం సందర్భంగా పవిత్రస్నానాలు ఆచరించేందుకు వేలాది మంది భక్తులు సముద్ర తీరానికి వస్తారు. తెల్లవారుజాము నుంచే స్నానాలు ఆచరించి సూర్యభగవానుని దర్శించుకోవడం ఆనవాయితీ. ముఖ్యంగా శివసాగర్ బీచ్, నువ్వలరేవు, వజ్రపుకొత్తూరు, తోటూరు తీరాలకు వేల సంఖ్యలో భక్తులు వచ్చి పుణ్యస్నానాలు చేస్తుంటారు. ఈ ఏడాది మహా కుంభమేళా జరుగుతున్న నేపథ్యంలో భక్తులు సంఖ్య మరింత పెరిగే అవ కాశం ఉన్నా వారికి ఎటువంటి ఏర్పాట్లు చేయకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. పవిత్ర స్నానాలు ఆచరించిన తరువాత దుస్తులు మార్చుకునేందుకు అవ కాశాలు లేవు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఏర్పాట్లు చేయడంతో పాటు పోలీసులు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండాచర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

షాపులోకి దూసుకెళ్లిన లారీ

ఆమదాలవలస, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధి పార్వతీశంపేట దగ్గర ఓ లారీ ఆదివారం తెల్లవారుజామున టిఫిన్ షాప్‌లోకి దూసుకెళ్లింది. సరుబుజ్జిలి వైపు నుంచి శ్రీకాకుళం వైపు లోడుతో వెళ్తున్న ఈ లారీ పార్వతీశంపేట జంక్షన్ వద్ద మలుపు తిరుగుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. తెల్లవారుజాము కావడం వల్ల షాపులో ఎవరూ లేకపోవ డంతో పెద్ద ప్రమాదం తప్పింది. పొగమంచు వల్లే ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): హైవేపై బెల్లుపడ వద్ద కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో కారు ముందు భాగం నుజ్జు నుజ్జయింది. కారులో ఉన్న వారు చిన్న చిన్న గాయాలతో బయట పడ్డారు. ఆదివారం సాయంత్రం పలాస నుంచి బరంపురం వెళ్తున్న కారు అతి వేగంగా రావడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణం

హరిపురం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): బిన్నల మదనాపురంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న సీతారామాలయం ప్రారంభం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారంతో పూర్తయ్యా యి. సింహాచల దేవస్థానం వేదపండితులు ముప్పిరాల నారాయణమూర్తి ఆధ్వర్యంలో విగ్రహ, శిఖర ప్రతిష్ఠ, పూర్ణాహుతి చేపట్టారు. అనంతరం సీతారాముల కల్యా ణాన్ని కన్నుల పండవగా నిర్వహించారు. జడ్పీ చైర్‌పర్సన్ పిరియావిజయసాయిరాజ్, టీడీపీ నాయకులు కొర్ల కన్నారావు, మాజీ ఎంపీపీ కొర్ల కవిత దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.